www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 సంచిక: 159 హైదరాబాద్ బుధవారం 27-08-2025 పేజీలు: 05 ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## తెలంగాణలోనే కాదు.. దేశమంతా యూరియా కొరత



**హైదరాబాద్ ఆగస్టు 25 (సిద్దిపేట పవర్):**

తెలంగాణలోనే కాదు.. దేశమంతా యూరియా కొరత ఉందని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. యూరియా కొరత పట్ల రైతులు ఆందోళనలు చేయడం, చెప్పులు క్యూలైన్‌లో పెట్టడంపై విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న నేపథ్యంలో మంత్రి స్పందిస్తూ రైతాంగానికి బహిరంగ లేఖ రాశారు. యూరియా కొరతకు కారణాలేంటో లేఖలో వివరించారు.

"రాష్ట్రంలో యూరియా కొరతకు రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది రాష్ట్రానికి దిగుమతి ద్వారా కేటాయించిన యూరియా ప్రపంచ వ్యాప్తంగా జియో పాలిటిక్స్ నేపథ్యంలో ఎర్ర సముద్రంలో నౌకాయానం నిలిచిపోయింది. ఆగస్టు వరకు రాష్ట్రానికి దిగుమతి ద్వారా 3.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేంద్రం కేటాయించింది. కానీ, నౌకాయానం నిలిచిపోవడంతో సమయానికి రాలేదు. రెండో కారణం.. దేశీయంగా యూరియా ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గస్థాయిలో లేకపోవడం. రామగుండం ఫ్యాక్టరీ నుంచి 1,69,325 మెట్రిక్ టన్నులు కేటాయించారు. కానీ, ఆ ఫ్యాక్టరీ 1,06,853 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేసింది. 62,473 మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడింది.

రామగుండం నుంచి అత్యధిక కేటాయింపులు జరపాలని కేంద్రాన్ని కోరినా ఆ ఫ్యాక్టరీ ఉత్పత్తిలో కేవలం 40 శాతమే రాష్ట్రానికి కేటాయించింది. అయితే, మే నుంచి ఈనెల వరకు 78 రోజులు ఆ ఫ్యాక్టరీలో ఉత్పత్తి జరగలేదు. రాష్ట్రానికి రావాల్సిన యూరియా సమయానికి రాలేదు. యూరియా దిగుమతి లేదు.. దేశీయంగా సరఫరా లేదు.. దీంతో కొరత ఏర్పడింది. రైతులకు వాస్తవాలు తెలియాలనే ఈ లేఖ రాస్తున్నా"అని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

## అసలు రేవంత్ రెడ్డి ఎవరు?

### బీహార్ రాజకీయాల్లో రేవంత్ రెడ్డి జోక్యం ఏమిటన్న ప్రశాంత్ కిశోర్

### రేవంత్ రెడ్డికి బీహార్‌లో ఏం పని అని నిలదీత

### బీహార్‌ను అవమానించాడని ఆగ్రహం



**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

మాజీ రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీహార్ రాజకీయాల్లో రేవంత్ జోక్యం చేసుకోవడాన్ని తప్పుబట్టారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రశ్నలు సంధించారు. "అసలు రేవంత్ రెడ్డి ఎవరు? బీహార్‌లో ఆయనకు

..మిగతా 2లో

## ‘కోటా’ చిక్కుముడి విప్పేదెలా?

- స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై పార్టీ పెద్దలు, న్యాయ కోవిదులతో మంత్రుల చర్చలు
- జీవో ఇస్తే ఎదురయ్యే అడ్డంకులపై విశ్లేషణ
- గతంలో మరాఠా రిజర్వేషన్లను కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు పరిశీలన
- బిహార్‌కు సీఎం రేవంత్, మంత్రులు..
- రాహుల్ యాత్రకు సంఘీభావం



2

## కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే రాజకీయాలు వదిలేస్తా...

# పీసీసీ చీఫ్ ఒక గజినీ

- బీజేపీ ఎంపీల గెలుపుపై దొంగ ఓట్ల ఆరోపణలను ఖండించిన బండి సంజయ్
- ఆరు గ్యారంటీల హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రశ్న
- కరీంనగర్‌లో ఒకే మైనారిటీ ఇంట్లో 200 ఓట్లు ఉన్నాయని ఆరోప



**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని కేంద్ర మంత్రి బండి సంజయ్ సవాల్ విసిరారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు దొంగ ఓట్లతో గెలిచారంటూ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ చేసిన ఆరోపణలపై ఆయన కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలు నిరాధారమని, కరీంనగర్‌తో పాటు 8 నియోజకవర్గాల ప్రజలను అవమానించారని, వెంటనే క్షమాపణ చెప్పాలని

..మిగతా 2లో

## మనదే అత్యుత్తమ జట్టు.. కప్ మనదే

- ఆసియా కప్‌లో టీమిండియానే ఫేవరెట్ అన్న సెహ్వాగ్
- సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీని ప్రశంసించిన వీరూ
- మనదే అత్యుత్తమ జట్టని ధీమా వ్యక్తం చేసిన మాజీ ఓపెనర్
- 2026 టీ20 ప్రపంచకప్‌కు ఇది మంచి సన్నాహక టోర్నీ
- యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి ఆసియా కప్

**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

త్వరలో ప్రారంభం కానున్న ఆసియా కప్‌లో సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని భారత జట్టే టైటిల్ గెలుస్తుందని టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ ధీమా వ్యక్తం చేశాడు. ప్రస్తుతం టోర్నీలో పాల్గొంటున్న జట్లలో మనదే అత్యుత్తమ జట్టు అని, కప్‌ను నిలబెట్టుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పాడు.

ఆసియా కప్ అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన సెహ్వాగ్, భారత జట్టు సత్తాపై పూర్తి విశ్వాసం కనబరిచాడు. "మనం ప్రపంచ ఛాంపియన్లం. ఇటీవలే టీ20 ప్రపంచకప్ గెలిచాం. కాబట్టి ఆసియా కప్‌లో మనమే అత్యుత్తమ జట్టు అని నేను కచ్చితంగా చెప్పగలను. ఈసారి కూడా టైటిల్ మనమే గెలుస్తామని ఆశిస్తున్నాను" అని అన్నాడు.

సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీని సెహ్వాగ్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. "మనకు చాలా మంచి జట్టు ఉంది. కెప్టెన్‌గా సూర్య ముందుండి నడిపిస్తున్నాడు. అతను టీ20 ఫార్మాట్‌లో

..మిగతా 2లో



## రాజీనామా చేసే ధైర్యం ఉందా..?

- ఓటు చోరీకి పాల్పడితే అన్ని పార్లమెంట్ స్థానాలను బీజేపీయే గెలిచేదన్న ఎంపీ
- అందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళదామా? అని సవాల్
- కాంగ్రెస్ ఎనిమిది చోట్ల ఎలా గెలిచిందని ప్రశ్న

**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే ఊరుకునేది లేదని, ఓటు చోరీకి పాల్పడి ఉంటే దేశంలోని అన్ని పార్లమెంట్ స్థానాలను తామే గెలుస్తామని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని విమర్శించారు. తమ పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళతామని, దానికి కాంగ్రెస్ సిద్ధమా? అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే ధైర్యం

..మిగతా 2లో



## రేవంత్ సొల్లు పురాణం ఆపాలి

- కోదండరామ్ పై ప్రేమ ఉంటే సీఎం చేయండి
- కోదండరాంపై సీఎం రేవంత్ రెడ్డిది మొసలి కన్నీరు అంటూ శ్రవణ్ విమర్శలు
- జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో పోటీ చేయించాలని డిమాండ్
- ఓయూకు రూ. 1000 కోట్లు ఇచ్చే దమ్ముందా అని ప్రశ్న



**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రొఫెసర్ కోదండరాంపై సీఎం చూపిస్తున్నది మొసలి కన్నీరేనని, ఆయన ప్రేమలో ఏమాత్రం నిజాయతీ లేదని అన్నారు. రేవంత్ రెడ్డికి కోదండరాంపై నిజంగానే

..మిగతా 2లో

## యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దు

- యూరియా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది
- కృత్రిమ కొరత సృష్టించే వారిపై కఠిన చర్యలు
- ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను రైతులకు వెంటనే అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలి
- యూరియా నిల్వలు, సరఫరాపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష



**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న యూరియా నిల్వలు, సరఫరాపై ఐడీఓసీలో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, పర్ణిక రెడ్డి, మేఘారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, డా. రాజేష్ రెడ్డి, డా. వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు,

..మిగతా 2లో

## రైతుల ఆవేదనను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రాథమిక వైద్య సేవలు అందించడంలోనూ విఫలం
- రైతు ఆత్మహత్య రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య
- మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

రైతుల ఆవేదనను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు మండిపడ్డారు. తెలంగాణలో వ్యవసాయం పూర్తిగా కుప్పకూలిపోయిందనే విషాదాన్ని మరోసారి ఒక రైతు దుర్మరణం

..మిగతా 2లో

# అసలు రేవంత్ రెడ్డి ఎవరు?

**మొదటిపేజీ తరువాయి**

ఏం పని?" అని ప్రశ్నించారు.

బీహార్‌తో రేవంత్ రెడ్డికి ఉన్న సంబంధం ఏమిటని, ఆయన స్థాయి ఏమిటని ప్రశాంత్ కిశోర్ నిలదీశారు. ఒకవైపు బీహార్ ప్రజలను అవమానించేలా మాట్లాడి, మరోవైపు అదే బీహార్‌కు ఓట్లు అడగడానికి ఎలా వస్తారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి వైఖరిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీహార్‌ను అవమానించే నాయకులను కాంగ్రెస్ కలిగి ఉందని, ఇది రాహుల్ గాంధీ మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.



# పీసీసీ చీఫ్ ఒక గజినీ

## కాంగ్రెస్ మళ్లీ గెలిస్తే రాజకీయాలు వదిలేస్తా...

**మొదటిపేజీ తరువాయి**

డిమాండ్ చేశారు.

మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలపై బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని వ్యక్తి దొంగ ఓట్ల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. "గతంలో నేను బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి దిగిపోయినప్పుడు, ఒక బీసీగా స్పందించానని చెప్పిన మహేశ్ గౌడ్, ఇప్పుడు నేను బీసీని కాదని చెప్పడం విడ్డూరం. ఆయన్ను చూస్తే నాకు గజినీ సినిమా గుర్తుకొస్తోంది" అంటూ ఎద్దేవా చేశారు. దొంగ ఓట్ల గురించి మాట్లాడే కాంగ్రెస్ నేతలు, జగిత్యాలలో జరిగిన ఓట్ల చోరీ గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు.

అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బండి సంజయ్ ధ్వజమెత్తారు. "మహిళలకు ఇస్తామన్న రూ. 2,500, పెంచుతామన్న పింఛన్లు, నిరుద్యోగ భృతి, 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు ఎక్కడికి పోయాయి రేవంత్ రెడ్డి?" అని నిలదీశారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేశారని, త్వరలోనే ప్రజలు కాంగ్రెస్ నేతలను రాళ్లతో కొట్టే పరిస్థితి వస్తుందని విమర్శించారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటివరకు నయా పైసా కూడా విడుదల



చేయలేదని దుయ్యబట్టారు.

బీసీ రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం చేస్తోందని బండి సంజయ్ విమర్శించారు. కరీంనగర్‌లోని కొన్ని మైనారిటీ ఇళ్లలో ఒక్కో ఇంట్లో 200 ఓట్లు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. హిందూ ధర్మం, సనాతన ధర్మం కోసం బీజేపీ ఎప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

"భైంసాలో హిందువుల ఇళ్లు తగలబెట్టినప్పుడు ఈ కాంగ్రెస్ నేతలు ఎక్కడికి పోయారు? హిందూ పండుగలకు గుళ్లలో సౌండ్ పెట్టొద్దని చెప్పడం దుర్మార్గం" అని మండిపడ్డారు. యూపీఏ హయాంలోనే దేశంలోకి రోహింగ్యాలు పెద్ద ఎత్తున ప్రవేశించారని, టోపీలు పెట్టుకుని డ్రామాలు ఆడేది కాంగ్రెస్ నేతలేనని ఆయన విమర్శించారు.

# రేవంత్ సొల్లు పురాణం ఆపాలి

**మొదటిపేజీ తరువాయి**

ప్రేమ ఉంటే, వెంటనే ఆయనకు ముఖ్యమంత్రి పదవిని అప్పగించాలని డిమాండ్ చేశారు.

సీఎం పదవికి రేవంత్ కంటే కోదండరామే అన్ని విధాలా అర్హులని శ్రవణ్ అభిప్రాయపడ్డారు. కనీసం కోదండరాంతో మంత్రిగానైనా ప్రమాణ స్వీకారం చేయించాలని, రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీకి నిలబెట్టాలని అన్నారు. ఓయూలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడింది అంతా సొల్లు పురాణమేనని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి దమ్ముంటే తక్షణమే ఓయూకు వెయ్యి కోట్ల రూపాయల నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం న్యాయస్థానాల పరిధిలో ఉన్న కాళేశ్వరం ప్రాజెక్టు గురించి సీఎం ఎలా మాట్లాడతారని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ద్వారా కోర్టులను, న్యాయమూర్తులను అవమానిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం కోసం శ్రీకాంతాచారి, యాదయ్య వంటి వారు ఆత్మబలిదానాలు చేసుకున్నప్పుడు రేవంత్ రెడ్డి.. చంద్రబాబు నాయుడు సంకలో



ఉన్నారని ఆయన విమర్శించారు.

అదేవిధంగా, రాష్ట్ర అప్పుల విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అబద్ధాలు చెబుతున్నారని దాసోజు శ్రవణ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అప్పు రూ. 3,50,520 కోట్లు మాత్రమేనని పార్లమెంటు సాక్షిగా కేంద్ర మంత్రి వెల్లడించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందనే భయం సీఎం రేవంత్ రెడ్డిలో స్పష్టంగా కనిపిస్తోందని దాసోజు శ్రవణ్ వ్యాఖ్యానించారు.

# రాజీనామా చేసే ధైర్యం ఉందా..?

**మొదటిపేజీ తరువాయి**

ఉందా? అని ప్రశ్నించారు.

మేం ఓట్ల చోరీకి పాల్పడినట్టయితే, తెలంగాణలో కాంగ్రెస్ ఎనిమిది చోట్ల ఎలా గెలిచింది, అసదుద్దీన్ ఒవైసీ ఎలా విజయం సాధించారని నిలదీశారు. దమ్ముంటే మీ ఎనిమిది మంది ఎంపీలతో రాజీనామా చేయించాలని, తాము కూడా రాజీనామా చేస్తామని అన్నారు. కొత్త ఓటరు లిస్టుతో మళ్లీ ఎన్నికలకు వెళదామని వ్యాఖ్యానించారు. అప్పుడు వాస్తవాలు ఏమిటో ప్రజలకు తెలుస్తాయని అన్నారు.

బీజేపీని అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా అని ప్రశ్నించారు. కుంటిసాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై నిజాయతీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలని ఆయన అన్నారు. రాష్ట్రప్రభుత్వం నిర్వహణలోపం కారణంగానే యూరియా కొరత తలెత్తిందని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత ఇక్కడే ఎందుకు ఉందని ప్రశ్నించారు.



# కోటా చిక్కుముడి విప్పేదెలా?

- **స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై పార్టీ పెద్దలు, న్యాయ కోవిదులతో మంత్రుల చర్చలు**
- **జీవో ఇస్తే ఎదురయ్యే అడ్డంకులపై విశ్లేషణ**
- **గతంలో మరాఠా రిజర్వేషన్లను కొట్టేస్తూ ఇచ్చిన తీర్పు పరిశీలన**
- **బిహార్‌కు సీఎం రేవంత్, మంత్రులు.. రాహుల్ యాత్రకు సంఘీభావం**

**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలుపై చట్టపరంగా ఎదురయ్యే చిక్కుముళ్లను విప్పేందుకు మంత్రుల బృందం పార్టీ పెద్దలు, న్యాయ నిపుణులతో భేటీ అయింది. రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లోనే ఉన్నందున దీనిని చట్టపరిధిలో పరిష్కరించే మార్గాలపై సమాలోచనలు చేసింది.

ఒకవేళ జీవోలు ఇస్తే ఎదురయ్యే సవాళ్లు, దీనిని ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన కార్యాచరణ, కులగణన ద్వారా వచ్చిన ఎంపిరికల్ డేటాను న్యాయవ్యవస్థల ముందుంచే అంశాలపై క్షుణ్ణంగా చర్చించింది. 50శాతానికి మించి రిజర్వేషన్లు అమలవుతున్న రాష్ట్రాలు, వాటిపై గతంలో కోర్టులు ఇచ్చిన తీర్పులు, రాజ్యాంగ నిబంధనలన్నింటిపైనా చర్చలు జరిపింది.

రిజర్వేషన్లపై మార్గాన్వేషణ: 42 శాతం రిజర్వేషన్ల అమలు అంశంపై ఏర్పాటైన మంత్రుల కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, సీతక్క, పొన్నం ప్రభాకర్ సోమవారం ఢిల్లీలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో గంటపాటు భేటీ అయ్యారు.

ఇప్పటికే విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ అసెంబ్లీ ఆమోదించిన రెండు బిల్లులు రాష్ట్రపతి కోసం వేచి చూస్తున్న విషయాలతోపాటు, 2018లో చంద్రశేఖర్ రావు రిజర్వేషన్లను 50శాతానికి పరిమితి చేస్తూ చేసిన చట్టాన్ని తొలగించాలన్న ఆర్డినెన్స్‌పైనా చర్చించారు. ఈ బిల్లుల ఆధారంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 263 ప్రకారం బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ జీవో ఇవ్వడమా?, ఇస్తే ఈ ఉత్తర్వుల అమలును ఇతరులెవరూ కోర్టుకు వెళ్లి అడ్డుకోకుండా ముందుగానే కేవియట్ దాఖలు చేయడమా? అన్న అంశాలపై మంత్రులు సమాచాలోచనలు చేశారు.



ఒకవేళ కోర్టులు అభ్యంతరం చెబితే కులగణన సర్వే ద్వారా సేకరించిన డేటాతో బీసీల జనాభా, వెనకబాటుతనాన్ని నిరూపించే అవకాశాలపైనా చర్చించారు. ఇప్పటికే 10శాతం ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ల కోసం చేసిన 103వ రాజ్యాంగ సవరణతో విద్య, ఉద్యోగాల్లో మొత్తం రిజర్వేషన్లు 50శాతం దాటడాన్ని సుప్రీంకోర్టు సమర్థించిన దృష్ట్యా, సర్వే డేటాలోని అంశాలు తమకు కలిసి వస్తాయనే అభిప్రాయం వ్యక్తమైంది.

50 శాతం రిజర్వేషన్లు దాటితే సమానత్వపు హక్కు ఉల్లంఘన జరిగినట్లేనని, అసాధారణ పరిస్థితుల్లో మాత్రమే 50శాతం పరిమితిని దాటవచ్చని సుప్రీంకోర్టు.. గతంలో మరాఠాల రిజర్వేషన్‌లపై తీర్పుఇచ్చిన నేపథ్యంలో ఎంపిరికల్ డేటాను ఎంతవరకు ప్రామాణికంగా చూపవచ్చనే అంశంపైనా చర్చించారు. హైకోర్టు విధించిన గడువు సెప్టెంబర్ 30లోగా ఎన్నికలు నిర్వహించలేని పరిస్థితుల్లో అదనపు గడువు కోరే అవకాశాలపైనా చర్చలు జరిగాయి. అయితే ఈ నెల 29న జరిగే కేబినెట్ భేటీలో చర్చించి తుది నిర్ణయం చేయనున్నారు.

# రైతుల ఆవేదనను పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

రుజువు చేసిందన్నారు. అప్పుల భాదతో మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలం ఈర్లపల్లిలో రవి నాయక్ అనే రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కలిచివేసిందని మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రులు చూపిన నిర్లక్ష్య వైఖరి రైతు మరణానికి కారణం అయిందని దుయ్యబట్టారు. ప్రాథమిక వైద్య సేవలు అందించడంలో కూడా విఫలం అయిందని, ఇది కేవలం ఆసుపత్రుల నిర్లక్ష్యం కాదు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన హత్య అని మండిపడ్డారు. రైతులను నిరాశలోకి నెట్టి, ఇటు జీవితంలో అటు




మరణంలోనూ వారికి గౌరవం లేకుండా చేసినందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

# మనదే అత్యుత్తమ జట్టు.. కప్ మనదే

**మొదటిపేజీ తరువాయి**

ఓ టాప్ ప్లేయర్. గతంలో స్కై కెప్టెన్సీలో మనం ఎన్నో టీ20 మ్యాచ్‌లు గెలిచాం. అతని నాయకత్వంలో ఈసారి కూడా అద్భుతంగా రాణిస్తామని, ఆసియా కప్ గెలుస్తామని నమ్ముతున్నాను" అని వివరించాడు.

2026లో భారత్, శ్రీలంక వేదికగా జరగనున్న టీ20 ప్రపంచకప్‌కు సన్నద్ధమయ్యేందుకు ఈ ఆసియా కప్ ఒక గొప్ప అవకాశమని సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. "ఈ టోర్నీ ద్వారా కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇవ్వొచ్చు. ప్రపంచకప్ కోసం జట్టును సిద్ధం చేసుకోవచ్చు. మన బలాన్ని పరీక్షించుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం ఉండదు" అని తెలిపాడు. జట్టు ఎంపికపై వస్తున్న విమర్శలను పక్కనపెడుతూ, సెలక్టర్లు అత్యుత్తమ జట్టునే ఎంపిక చేస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశాడు.



యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఆసియా కప్ జరగనుంది. ఈ టోర్నీ టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. గ్రూప్‌ఏలో ఉన్న భారత్, సెప్టెంబర్ 10న యూఏఈతో తొలి మ్యాచ్ ఆడనుంది. సెప్టెంబర్ 14న పాకిస్థాన్‌తో, 19న ఒమన్‌తో తలపడనుంది.

# గణేష్ మండపాల దగ్గర విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

**మండప నిర్వాహకులు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లకు ప్రత్యేక సూచనలు చేసిన ఎస్పీ రావుల గిరిధర్.**

**వనపర్తి ప్రతినిధి,ఆగష్టు 26 (సిద్దిపేట పవర్):** వనపర్తి జిల్లాలో ఏర్పాటు చేసే గణేష్ మండపాల దగ్గర విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండపాల నిర్వహకులు, ప్రైవేట్ ఎలక్ట్రిషన్లకు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సూచించారు. మండపాలను విద్యుత్ లైన్ల కింద లేదా విద్యుత్తు లైన్లకు, ట్రాన్స్ఫార్మర్లకు దగ్గరగా ఏర్పాటు చేయరాదని చెప్పారు. మండపాలలో ఎర్త్ లీకేజ్ సర్క్యూట్ బ్రేకర్ మరియు అవసరమైన ఎంసిబి లు ఏర్పాటు చేయాలని కోరారు. మండపాల వైరింగ్ ను లైసెన్స్ పొందిన ఎలక్ట్రిషన్ ద్వారానే చేయించాలని, వైరింగ్ లో ఎక్కడ జాయింట్ లేకుండా చూసుకోవాలని సూచించారు. కనెక్ట్ అయిన లోడుకు సరిపోయే రేటెడ్ కేబుల్ వైర్లు, సరైన ఇన్సులేషన్ తో ఉపయోగించాలని సర్వీస్ కేబుల్స్ హుకింగ్ చేయరాదన్నారు. విద్యుత్ వైర్లు ఇనుప పైపులకు తగలకుండా చూడాలని అవసరమైతే తగిన ఇన్సులేషన్ పెట్టాలన్నారు. వైర్లు నేల మీద వేయకుండా తప్పనిసరి వేయాల్సివస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సరైన ఎర్తింగ్ తో త్రీ పిన్ ప్లగ్ ఉపయోగించాలని తెలిపారు. మండపాల నిర్మాణంలో ఇనుప పైపులు వాడితే వాటిని ఇన్సులేషన్ పదార్థంతో కవర్ చేయాలని సర్వీస్ వైరు పోలుకు ఫిక్స్ చేసిన తర్వాత సంబంధిత లైన్మెన్ లేదా జూనియర్ లైన్మెన్ అనుమతి లేకుండా మార్పులు చేయరాదని చెప్పారు. ఇన్వర్టర్ లేదా జనరేటర్ వాడికి రిటర్న్ కరెంటు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.



# యూరియాపై రైతులు ఆందోళన చెందవద్దు

**హైదరాబాద్ ఆగస్టు 26 (సిద్దిపేట పవర్):**

వ్యవసాయ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా విషయంలో కలెక్టర్లు జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటూ.. సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రైవేట్ డీలర్ల వద్ద ఉన్న యూరియా నిల్వలను రైతులకు వెంటనే అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించే వ్యాపారులు, అధిక ధరలకు విక్రయించే

ఫెర్టిలైజర్స్ షాప్ డీలర్స్ పై కేసులు నమోదు చేయాలని, వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించే వారిపై, వదంతులు వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు ప్రెస్ మీట్ లు పెట్టి రైతులకు భరోసా కల్పించాలని, .స్టాక్ వివరాలు వెల్లడించి, రైతుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించాలి సూచించారు.

ముఖ్యంగా ప్రైవేట్ డీలర్ ల వద్ద ఉన్న స్టాక్ సక్రమంగా సరఫరా అయ్యేలా ఆయా జిల్లా కలెక్టర్ లు చర్యలు తీసుకోవాలని అన్నారు.

యూరియా వ్యవసాయ సీజన్ ముగిసే వరకు ప్రతి ఎరువుల షాప్,పి. ఏ.సి.ఎస్ , ఆగ్రో సేవా కేంద్రాల వద్ద ఒక్కొక్క షాప్ కు ఒక అధికారిని నియమించాలని,వారికి బాధ్యతలు అప్పగించాలని, యూరియా ఇండెంట్ ఎంత వచ్చింది స్టాక్ లభ్యత ఎంత ఉంది,ఎంత సరఫరా చేశారు? తదితర విషయాలపై పక్కాగా మానిటర్ చేయాలని అన్నారు. పోలీస్ అధికారులు కూడా వ్యవసాయ అధికారులు, ప్రతి షాప్ వారిగా నియమించిన అధికారులతో సమన్వయం చేసుకోవాలని, యూరియా సరఫరాలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు

రాబోయే రబీ సీజన్ కు సంబంధించి రైతులకు ఎంత యూరియా అవసరమో అంచనా వేసి, వాస్తవ లెక్కలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లాల వారీగా రాష్ట్ర ప్రభుత్వానికి ఇండెంట్ పంపాలని, ఆ ప్రతిపాదనలు బట్టి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఇండెంట్ పంపుతుందని వివరించారు.

అనంతరం మంత్రి జూపల్లి మాట్లాడుతూ... రాష్ట్రాలకు యూరియా కేటాయింపుల కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయని, రాష్ట్రాల అవసరాలకు తగ్గట్లుగా యూరియా సరఫరా చేయాల్సిన కేంద్రం తెలంగాణకు సహకరించడం లేదన్నారు. కేంద్రం తెలంగాణకు ఖరీఫ్ సీజనుకు 9.8 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాలని, కానీ ఇప్పటివరకు కేవలం 6.6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియానే సరఫరా చేసిందని, ఇంకా 3 లక్షలకు పైగా మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేయాల్సి ఉందని, దీంతో రాష్ట్రంలో యూరియా కొరత నెలకొందన్నారు. కానీ ప్రతిపక్ష పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని మండిపడ్డారు. సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

యూరియా సరఫరా సరఫరాను పెంచేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని, రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని కోరారు. రైతుల అవసరాలను తీర్చడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ మాట్లాడుతూ.. నాగర్ కర్నూలు జిల్లాలో 5,38,462 ఎకరాల్లో పంట సాగు జరుగుతుందని అందుకు అనుగుణంగా 34942 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా ఇప్పటివరకు 21186 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, నేటి వరకు 20297 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేయడం జరిగిందని, ప్రస్తుతం 889 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలో అందుబాటులో ఉందని, సెప్టెంబర్ 30 నాటికి జిల్లాకు 13755 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానున్నట్లు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంత్రికి వివరించారు.

జిల్లావ్యాప్తంగా ఉన్న 22 ప్రాథమిక వ్యవసాయ కేంద్రాలు,33 రైతు ఆగ్రో సహాయ కేంద్రాలు, 236 ప్రైవేటు క్రిమిసంహారక విక్రయ దుకాణాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో ఎక్కడా కొడత లేకుండా విక్రయ కేంద్రాల ద్వారా పకడ్బందీగా యూరియా పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ప్రతి యూరియా విక్రయ కేంద్రం వద్ద ఒక ప్రభుత్వ అధికారిని నియమించి విక్రయాలను పారదర్శకంగా కొనసాగేలా ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

నాగర్ కర్నూల్ శాసనమండలి సభ్యులు కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ....

జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా యూరియాను అందించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేయాలన్నారు.

ముఖ్యంగా ప్రైవేట్ విక్రయ కేంద్రాల వద్ద అధిక ధరలు వసూలు చేయకుండా చూడాలని ఆయన సూచించారు.

నియోజకవర్గాల వారీగా డీలర్లు, ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లు కలెక్టర్లు చేయాలని కోరారు.

నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ.. నాగర్ కర్నూలు నియోజకవర్గ పరిధిలోని తాడూరు తిమ్మాజీపేట మండలాల్లో గతంలో జడ్చర్ల నుండి రైతులు తెచ్చుకునేవారు అని ప్రస్తుతం అక్కడ యువనందుకు స్థానికంగా కొనుగోలు చేసేందుకు రైతులు అధికంగా విక్రయ కేంద్రాలకు వస్తున్నారని అందుకు సరిపడా యూరియాను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రైవేటు డీలర్లు అధిక రెట్లు బ్లాక్ మార్కెట్ను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ...అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ పదర మండలాల్లో యూరియా కొరత ఉందని, రైతుల అవసరాలకు అనుగుణంగా పంపిణీ చేపట్టాలని ఎమ్మెల్యే కోరారు అందుకు జిల్లా కలెక్టర్ స్పందిస్తూ అవసరమైన యూరియాను ఆయా మండలాలకు పూర్తిస్థాయిలో యూరియాను పంపిణీ చేస్తున్నట్లు చేరవేసినట్లు కలెక్టర్ తెలిపారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ....కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో వెల్దండ మండలంలో యూరియా కొరత అధికంగా ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కలెక్టర్ నిన్న రాత్రి జిల్లాకు వచ్చిన యూరియా నిలువలనుండి కల్వకుర్తి నియోజకవర్గానికి చేరవేసినట్లు జిల్లా కలెక్టర్ వివరించారు.



## గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కరించండి

**బి జె పి పార్టీ ఆధ్వర్యంలో చేర్యాల MRO కి వినతి**

**చేర్యాల, ఆగస్టు 26 (సిద్ధిపేట పవర్)** బిజెపి చేర్యాల మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో ఈరోజు చేర్యాల తహసీల్దార్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది చేర్యాలలో ఉన్న ప్రతి గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లులు మంజూరు చేయాలని చేర్యాల బిజెపి మండల అధ్యక్షులు వడ్లకొండ సంజీవులు గౌడ్ అన్నారు, అలాగే గ్రామంలో ఉన్న సమస్యలు వీధిలైట్లు మురికి కాలువలు సీసీ రోడ్ల సమస్యలు అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు దీని వెంటనే అధికారులు ఈ సమస్యలను పరిష్కరించాలని అన్నారు లేని ఎడల భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను ఏకం చేసి ప్రజా ఉద్యమాన్ని చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బూర్గు సురేష్ గౌడ్ గారు రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్ర మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు పోతుగంటి రామదాసు గారు, ముచ్చంతుల సిద్ధారెడ్డి, చేర్యాల మండల ప్రధాన కార్యదర్శి తౌట బాలరాజు గారు, నాయకులు మన్నె సత్య,కుర్రారం బాల నరసయ్య, బిజెపి మండల ఉపాధ్యక్షులు బయ్యారపు యాదగిరి, మండల కార్యదర్శి గంధాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు



## పథకాలను అమలుపరచని ప్రభుత్వం

**ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలి బిజెపి డిమాండ్**

**నంగునూరు, ఆగస్టు 26 (సిద్ధిపేట పవర్)** గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారము ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చెయ్యాలని బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచన మేరకు నంగునూర్ మండల ఎమ్మార్వో కి బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు చేయాలని మరియు స్థానిక సమస్యల విషయమై భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గత పది రోజులుగా మండలంలోని అన్ని గ్రామాలల్లో స్థానిక సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకోవడం జరిగిందనీ గ్రామాల నుండి మొదలుకొని మండల కేంద్రాలు అలాగే జిల్లా కేంద్రాల వరకు అంతటా పారిశుధ్య సమస్య విపరీతంగా ఉందనీ, వర్షాకాలం దృశ్య అంటు వ్యాధులు రాకుండా ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మార్వో ని కోరామని, మండలంలో చాలా రోడ్లు గుంతలు, ఇతర సమస్యలు ఉన్నాయనీ కావున రోడ్ల మరమ్మత్తులకు చర్యలు తీసుకోవాలని, పాఠశాలలకు సంబంధించి గురుకులాలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో సమస్యలు విలయ తాండవం చేస్తున్నాయనీ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపగలరని అన్నారు. కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శౌచాలయలలు లేక విద్యార్థులు ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని కావున ఈ విషయంలో శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. పాఠశాల, కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఆర్టీసీ బస్సులు చాలా గ్రామాల్లో అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారనీ కావున సాధ్యమైనన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం కలిగేలా చర్యలు తీసుకోవాలి అని అన్నారు. నంగునూర్ మండలంలో ఎక్కువ భాగం వ్యవసాయదారులు బోరు బావులతోనే వ్యవసాయం కొనసాగిస్తున్నారు. ఏదైనా సమస్యతో ట్రాన్స్ఫార్మర్ కాలిపోయినప్పుడు మరమ్మత్తుల కోసం వ్యవసాయదారులు రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తున్నది. ఇలా కాకుండా సత్వరమే వచ్చేలా చర్యలు తీసుకోవలని ఎమ్మార్వో కి విన్నపించడం జరిగింది అని అన్నారు. అన్ని అర్హతలు ఉండి రుణమాఫీ కానీ రైతులు సగానికి పైగా ఉన్నారు. ప్రతి రైతుకి రెండు లక్షల రుణమాఫీ అయ్యేలా చూడాలని అన్నారు. రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో మండలంలో అధికారపార్టీ వాళ్ళకే అధికారులు ప్రాధాన్యత ఇవ్వడం కూడా సరికాదని ఈ సందర్భంగా తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి బండి సతీష్ ,రత్నాకర్ రెడ్డి,సతీష్ గౌడ్,నరేష్,రాజినికర్ రెడ్డి,కృష్ణ,శ్రీనివాస్ గౌడ్, యాదగిరి,గంధం పరమేశ్వర రెడ్డి,కిషోర్ పాల్గొన్నారు



## గాంధీ ఆసుపత్రిలో హెపటైటిస్ బీ వ్యాక్సినేషన్

**సికింద్రాబాద్, ఆగస్ట్ 26 ( సిద్ధిపేట పవర్) :** సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో మంగళవారం హెపటైటిస్ బీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొయినాబాద్ రోటరీక్లబ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది 130 మందికి ఫస్ట్ డోసు, 249 మందికి సెకండ్ డోసు వ్యాక్సిన్ ను ఇచ్చినట్లు గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ తెలిపారు. గాంధీ మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీ ,డాక్టర్లు, మెడికల్ స్టూడెంట్స్,నర్సులు, పారామెడికల్ సిబ్బందికి వ్యాక్సిన్ ఇచ్చారు. గతంలో410 మందికి హెపటైటిస్ బీ వ్యాక్సిన్ ను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.కే.సునీల్,ఆర్ఎంవోలు డా.శేషాద్రి, డా.రజనీ, డా.కళ్యాణ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు





# మట్టి గణపతే మహా గణపతి...

## వినాయకచవితికి మట్టిగణపతులనే పూజించండి...

- విఘ్నేశ్వరుని దయతో అన్ని విఘ్నాలు తొలగాలి...
- మనం ప్రకృతిని ప్రేమిస్తే, గణపతి మనల్ని ప్రేమిస్తాడు. మనం ప్రకృతిని రక్షిస్తే, గణపతి మనల్ని రక్షిస్తాడు.
- వినాయక మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి..
- వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు...

**మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్ధిపేట పవర్:** జిల్లా ప్రజలకు మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు వినాయక చవితి పర్వదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈ వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలంతా కుటుంబసమేతంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. సకల కార్యాలకు ప్రథమ పూజ చేసేది.. పూజించేది విగ్నేశ్వరున్నే అని చెప్పారు. విగ్నేశ్వరుని అనుగ్రహముతో విఘ్నాలు తొలిగి అన్నింటా శుభం చేకూరాలని ఆకాంక్షించారు. విగ్నేశ్వరుని దయతో ఎలాంటి విఘ్నాలు రాకుండా నిర్విఘ్నంగా అన్ని కార్యాలు నెరవేరాలని ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ఆ విగ్నేశ్వరుణ్ణి ప్రార్థించారు. ప్రతి ఒక్క ఇంటిలో మట్టి గణపతి ప్రతిమ ను పూజించాలన్నారు. మట్టి గణపతి పూజించడం ఎంతో శ్రేష్టమని " మట్టి గణపతే మహా గణపతి " అని చెప్పారు. వినాయకచవితికి మట్టిగణపతులనే పూజించండి. మనం ప్రకృతిని పేమిస్తే, గణపతి మనల్ని ప్రేమిస్తాడు. మనం ప్రకృతిని రక్షిస్తే, గణపతి మనల్ని రక్షిస్తాడు. పర్యావరణాన్ని పరిరక్షణ తో దేవుణ్ణి పూజించాలని పిలుపునిచ్చారు. అదేవిదంగా వినాయక నవరాత్రి ఉత్సవాల్లో మండపాల వద్ద యువత, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ లైన్ ల విషయం లో, చెరువు ల్లో నిమర్జనం చేసే సమయం లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు..



## శ్రీ వందన ఆసుపత్రిలో అరుదైన వీ-బిఏసి డెలీవరి..

**సిద్ధిపేట పవర్:** సిద్ధిపేట పట్టణంలోని శ్రీవందన మెటర్నిటి ఆసుపత్రిలో అరుదైన వీబీఏసి డెలివరీ చేయడం జరిగిందని ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్. వందన బొజ్జ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ వందన బొజ్జ మాట్లాడుతూ.. ఒకసారి మహిళకు మొదటి కాన్పు లో సిజేరియన్ అయిన తర్వాత దాదాపుగా రెండవ డెలివరీలో నార్మల్ కాదని ప్రజల్లో అపనమ్మకం ఉందని.. కానీ అలాంటి అనుమానాలను పటా పంచలు చేస్తూ నార్మల్ డెలివరీ చేసి నిరూపించడం జరిగిందని తెలిపారు. ఈ నార్మల్ డెలివరీ విజయవంతంగా చేయబడి తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యురాలు వందన తెలిపారు. సిజేరియన్ తర్వాత నార్మల్ డెలివరీ చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు ఉన్నాయి, మళ్ళీ సిజేరియన్ చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో డాక్టర్ వందన వివరించారు. ప్రయివేటు ఆసుపత్రిలో అసలు నార్మల్ డెలివరీ చేయరనే అపవాదు ఉందని, కానీ శ్రీ వందన ఆసుపత్రిలో రెండు వారాల్లో 7 నార్మల్ డెలివరీలు విజయవంతంగా చేయడం జరిగిందన్నారు. తమ ఆసుపత్రిలో అన్ని రకాల కాన్పులు, పెయిన్ లెస్ నార్మల్ డెలివరీలు, గర్భసంచి ఆపరేషన్ లు, ట్యూబెక్టమీ చేయబడునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓటి అసిస్టెంట్ రమేష్, స్టాఫ్ మేనేజ్మెంట్ నాగరాజు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.





## మట్టి ప్రతిమలను పూజిద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం

**మట్టి గణపతిని తయారు చేసిన కమిషనర్**

**సిద్ధిపేట పవర్:** కమిషనర్ అశ్రిత్ కుమార్ క్రాంతి హై స్కూల్ లో మృత్తికా గణపతి నిర్మాణ శిక్షణ శిబిరంలో పాఠశాల యాజమాన్యం వారి ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొని మట్టి గణపతి విద్యార్థుల ఎదురుగా తయారు చేసి చూపించారు. మట్టి గణపతి తయారు చేసిన అనంతరం వినాయక చవితి ప్రత్యేకతను విద్యార్థులకు వివరించారు. వినాయక చవితి రోజు మన స్వహస్తాలతో వినాయకుణ్ని తయారు చేస్తే వచ్చే సంతృప్తి వేరనీ,మన చేతితో రూపం ఇచ్చిన విగ్నేషుడిని కొలిస్తే పండగ తెచ్చే ఆనందం రెట్టింపవుతుందని విద్యార్థులకు తెలిపారు. అందుకోసం వినాయకుని తయారీని సులభమైన పద్ధతులలో చేసి చూపించారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగమవ్వాలని , వినాయక చవితి పండుగ అంటేనే ప్రకృతితో ముడిపడి ఉంటుందని వినాయక చవితికి ఉపయోగించే మట్టి వినాయక ప్రతిమకాని, పత్రీ గాని ప్రకృతి రూపాలే అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో తయారు చేసిన మట్టి విగ్రహాలను నెలకొల్పకుండా మట్టితో చేసినవారికి మాత్రమే ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రసాయన రంగులతో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేసినట్లయితే నీరు పూర్తిగా కలుషితమవుతాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు, కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి ఏడాది మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేసే పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వారితో కలిసి మోడర్న్ బస్టాండ్ వద్ద ప్రయాణికులకు, విద్యార్థులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. సిద్ధిపేట పట్టణ ప్రజలందరికీ కూడా ముందస్తుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రవీందర్ (సీనియర్ అసిస్టెంట్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు), భగవాన్ (క్రాంతి పాఠశాల యాజమాన్యం) తదితరులు పాల్గొన్నారు.




## ఏసీబీ వలలో పట్టుబడ్డ ఉపాధి హామీ చట్టం ఈసి

**చేర్యాల, ఆగస్టు 26 (సిద్ధిపేట పవర్)** మద్దూరు మండల పరిషత్ కార్యాలయం లో ని మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టంలో ఈసీ గా పనిచేస్తున్న బండకింది పరుశరాములు, 11 వేల 500 లంచం తీసుకుంటాండగా ఏసీబీ అధికారి మెదక్ డి.ఎస్.పి సుదర్శన్, మంగళవారం పట్టుకున్నారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న ఈసీ పరుశరాములపై ఈనెల 25న తమకు ఫిర్యాదు వచ్చిందని తెలిపారు ఫిర్యాదు దారుడి నుండి ఈసి 11500 లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు సమాచారం తెలిపారు దీంతో పరుశరాములు ఉపాధి హామీ చట్టం కార్యాలయంలో బాధితుడు నుండి డబ్బులు తీసుకుంటుండగా పట్టుకున్నామన్నారు. అలాగే అతని ఇంటివద్ద సోదాలు నిర్వహిస్తూ ఈసీ ని కస్టడీలోకి తీసుకున్నట్లు తెలిపారు.



## షాడో కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా ఎంపీ..

**- రేవంత్ రెడ్డిని తిట్టడు, తిట్టనియ్యడు..**
**- బీజేపీ, కాంగ్రెస్ రెండు రెండే యూరియా సరఫరా లో వైఫల్యం..**
**- భవిష్యత్తు లో మూల్యం తప్పదు..**

**సిద్ధిపేట పవర్:** బీజేపీ ఎంపి గా రైతుల ఇబ్బందులు తీర్చాల్సిన రఘునందన్ రావు కాంగ్రెస్ పార్టీ షాడో అధికార ప్రతినిధి లెక్క సీఎం రేవంత్ రెడ్డిని తిట్టకుండా చూస్తున్నాడని సిద్ధిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, సారయ్య, సోమిరెడ్డి, కొండం రవీందర్ రెడ్డి లు లు విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు... ఎరువుల అంశంపై మంత్రుల వ్యాఖ్యలు చూస్తే ప్రభుత్వం చేతులు ఎత్తిసేనట్టుగా ఉందని గతంలో కేసీఆర్ హయాంలో ముందస్తు ప్రణాళికలు ఉండేవి..రైతులకు యూరియా సమస్య రాకుండా 10 ఏండ్లు చూశారు ఎండాకాలం లొనే సమీక్షలు జరిగేవని, బఫేర్ స్టాక్ అందుబాటులో ఉండేది కేసీఆర్, మంత్రులు స్వయంగా పర్యవేక్షణ చేసేవారు.. ఢిల్లీలో రివ్యూ చేసి యూరియా తెచ్చేవారు. రైతుల పట్ల కేసీఆర్ కు ప్రేమ ఉంది కాబట్టి తాపత్రయ పడ్డారు.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చింది అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చింది.. రైతులకు యూరియా ఇచ్చే పరిస్థితుల్లో ప్రభుత్వం లేదు రేవంత్ రెడ్డిని ఒక్క మాట అననిస్తాలేదు బీజేపీ పార్టీ రాష్ట్రంలో బీజేపీ ప్రతిపక్ష పార్టీ అన్న విషయం మర్చిపోయిందని ఏద్దేవా చేశారు.. బీజేపీ ఎంపీ యూరియా తేవడంలో ఫెయిల్ అయ్యాడని, రైతుల కోసం బీఆర్ ఎస్ పోరాటం చేస్తుంటే బీజేపీ నిమ్మకునిరెత్తనట్టుగా ఉందని మండి పడ్డాడు..యూరియా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామనే హామీ ఇప్పటికి లేదని బీజేపీ పార్టీ ని కూడా నిలదిస్తామన్నారు..నియోజకవర్గ పరిధిలోని యూరియా సమస్య చాలా ఉంది.. రైతులు రోడ్డు ఎక్కి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. జిల్లా యంత్రాంగం వైఫల్యం చెందింది. మంత్రులు, అధికారులు విఫలం చెందారు..జిల్లా మంత్రి ఎక్కడ ఉన్నాడు. స్పందన లేదు జిల్లాకు రావాల్సిన కోటా ఎక్కడ.. మాజీ మంత్రి హరీష్ రావు ఇప్పటికే పలుసార్లు హెచ్చరించారు.. అయిన ప్రభుత్వం లో స్పందన లేదు.. యూరియా పరిస్థితి ఆందోళనకరంగా మారింది భవిష్యత్తు లో తగిన గుణపాఠం తప్పదు హెచ్చరించారు.. ఈ సమావేశం లో ప్యాక్స్ చైర్మన్ కోల రమేష్, కౌన్సిలర్ అరవింద్ రెడ్డి, మాజి సర్పంచ్ ఆంజనేయులు, పర్శరాములు, సీనియర్ నాయకులు పొన్నమల్ల రాములు, విద్యార్థి యువ నాయకులు యాదగిరి, ఆకుబత్తిని రాము, రవి, రమేష్, సాయి, ఇమ్రాన్, చంటి, నరేందర్ తదితరులు ఉన్నారు..



## మట్టి గణపతుల ఏర్పాటు ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీగా ఉంటుంది

**డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్**




**సికింద్రాబాద్, ఆగస్ట్ 26 ( సిద్ధిపేట పవర్) :**మట్టి గణపతుల ఏర్పాటు ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీగా ఉంటుందని ఉత్తర మండల డిసిపి సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ సోమ సుందరం వీధిలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకులు, తులసి మొక్కల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.... తులసి మొక్కలను, మట్టి వినాయకులను పంపిణీ చేస్తూ మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్ గౌడ్, సభ్యులు మంచి సందేశాన్ని అందిస్తున్నారని వారిని అభినందించారు. బహిరంగ ప్రదేశాలలో వినాయక మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తగిన భద్రతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జలంధర్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రస్తుతమున్న బిజీ లైఫ్ లో పర్యావరణం గురించి ఆలోచించే తీరిక ప్రజల్లో లేకుండా పోతుందని అందువల్లపర్యావరణాన్ని కాపాడడానికి మట్టి గణపతుల పూజ ఓ మార్గమని అన్నారు. అడిషనల్ డీసీపీ అశోక్, మహంకాళి ఏసిపి సైదయ్య, ఇన్స్ పెక్టర్ పరుశురాం, నర్సింగరావు, రామకృష్ణ, ఎస్సైలు, మక్తల ఫౌండేషన్ సభ్యులు నరసింహ చారి, సూర్య ప్రకాష్, వెంకటేష్, వేణు, ప్రకాష్, మధుసూదన్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, పూర్ణచందర్, శివకుమార్, రాజు, కిరణ్ పాల్గొన్నారు

## మట్టి గణపతుల ఏర్పాటు ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీగా ఉంటుంది

**డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్**

**సికింద్రాబాద్, ఆగస్ట్ 26 ( సిద్దిపేట పవర్) :**

మట్టి గణపతుల ఏర్పాటు ఎన్విరాన్మెంట్ ఫ్రెండ్లీగా ఉంటుందని ఉత్తర మండల డిసిపి సాధన రష్మీ పెరుమాళ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ సోమ సుందరం వీధిలో మక్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మట్టి వినాయకులు, తులసి మొక్కల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డీసీపీ మాట్లాడుతూ.... తులసి మొక్కలను, మట్టి వినాయకులను పంపిణీ చేస్తూ మక్తాల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు మక్తాల జలంధర్ గౌడ్, సభ్యులు మంచి సందేశాన్ని అందిస్తున్నారని వారిని అభినందించారు. బహిరంగ ప్రదేశాలలో వినాయక మండపాలను ఏర్పాటు చేసే నిర్వాహకులు తగిన భద్రతను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జలంధర్ గౌడ్ మాట్లాడుతూ.... ప్రస్తుతమున్న బిజీ లైఫ్ లో పర్యావరణం గురించి ఆలోచించే తీరిక ప్రజల్లో లేకుండా పోతుందని అందువల్లపర్యావరణాన్ని కాపాడడానికి మట్టి గణపతుల పూజ ఓ మార్గమని అన్నారు. అడిషనల్ డీసీపీ అశోక్, మహంకాళి ఏసిపి సైదయ్య, ఇన్స్ పెక్టర్ పరుశురాం, నర్సింగరావు, రామకృష్ణ, ఎస్సైలు, మక్తల ఫౌండేషన్ సభ్యులు నరసింహ చారి, సూర్య ప్రకాష్, వెంకటేష్, వేణు, ప్రకాష్, మధుసూదన్, భాస్కర్, సుబ్రహ్మణ్యం, పూర్ణచందర్, శివకుమార్, రాజు, కిరణ్ పాల్గొన్నారు




## సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్నట్లు వుంది హరీష్ రావ్ డ్రామాలు

- **రెండు రోజులుగా అల్లీపూర్ సొసైటీ గోదాం లో యూరియా దాచిపెట్టి రైతులకు ఇవ్వకుండా డ్రామాలు ఆడుతున్న హరీష్ రావ్ అతని అనుచరులు**
- **మండల అభివృద్ధికీ కాంగ్రెస్ నిధులు ఇస్తే హరీష్ రావ్ పాలభిషేక డ్రామాలు**
- **అధికారం కోల్పోయాక చిన్నకోడూరు కు రైలు తెచ్చిన అని గొప్పలు చెప్పే హరీష్ రావ్ యూరియా ఎందుకు తేవట్లేదు**
- **రైతులపై చిత్తశుద్ధి ఉంటే fscs అల్లీపూర్ సొసైటీ లో అవినీతికీ పాల్పడ్డ ,నీ అనుచరుడైన చైర్మన్ ను సస్పెండ్ చేపించు**
- **రెండు ప్రాజెక్టులు నిర్మించి పరిహారం ఇవ్వకుండా రైతులను ముంచింది నువ్వు కాదా**
- **చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ యాదవ్**

**సిద్దిపేట పవర్;** కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ రోజు యూరియా కొరత ఏర్పడడం వచ్చిన యూరియాను సిద్దిపేట నియోజకవర్గం చిన్న కోడూరు మండలంలో రైతులకు ఇబ్బంది కలగకుండా సంబధిత అధికారుల సహాయంతో నేరుగా రైతులకు అందించాల్సిందిగా చూడాలని నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పూజల హరికృష్ణ గారిని, జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు వివేక్ వెంకటస్వామి గారినీ కాంగ్రెస్ నాయకులు కోరగా వారి ఆదేశానుసరం అల్లిపూర్ రెవెన్యూ, అల్లీపూర్ రైతు వేదిక క్లస్టర్ పరిధిలో ఉన్న కిష్టాపూర్, చెల్కలపల్లి, కాసారం పల్లీ, కొత్తపల్లి, రంగయ్య పల్లీ, ఎల్లయ్య పల్లీ, కమ్మర్లపల్లి, మైలారం, బిక్కబండ, కొండెంగలకుంట ఇలా అన్ని గ్రామాల రైతులకు అల్లిపూర్ రైతు వేదికలో టోకెన్ ఇస్తే అది ఓర్చుకోలేని హరీష్ రావ్ టోకెన్స్ ఇచ్చిన అధికారిని సస్పెండ్ చేయాలనీ అనడం సిగ్గు చెటన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు మీసం మహేందర్ మాట్లాడుతూ హరీష్ రావ్ నేరుగా రైతులకు యూరియా అందకుండా అపుతూ రైతులను ఒక దగ్గర గుమిగుడే విధంగా చేసి రెచ్చగొట్టడం తమ సిగ్గుమాలిన తనానికి నిదర్శనమన్నారు, రైతులపై చిత్త శుద్ధి ఉంటే fscs అల్లీపూర్ సొసైటీ లో అవినీతికి పాల్పడి రైతులను ముంచిన నీ అనుచరుడు అయినటువంటి చైర్మన్ను పదవి నుండి తొలగించి క్రిమినల్ కేసు పెట్టించు సొమ్ము రికవరీ చేసి రైతులపై చిత్తశుద్ధి చాటుకోవాలని సవల్ విసిరారు. అంతేకాకుండా గతంలో జిల్లా ఇన్చార్జి మంత్రిగా ఉన్న కొండ సురేఖ గారికి చిన్నకోడూరు మండలంలో వివిధ గ్రామాలకు గ్రామపంచాయతీ భవానలు,అంగన్వాడి కేంద్రాలు,సిసి రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీలు, హైమక్స్ లైట్స్ ఇలా అన్ని రకాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని నియోజకవర్గ ఇన్చార్జ్ పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు అందుకుగాను మండల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు కేటాయిస్తే బిఆర్ఎస్ నాయకులు హరీష్ రావ్, కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడం సిగ్గుచేటు అన్నారు. మరియు చిన్నకోడూరు కు రైలు వస్తే హరీష్ రావ్ తెచ్చాడాని పాలభిషేకలు చేపించ్చుకునే ఈ హరీష్ రావ్ మరీ రైతులకు యూరియా ఎందుకు తేవడం లేదని ప్రశ్నించారు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరశురాం, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాకాల భూపతి, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఉడుత ప్రశాంత్, మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడుకోర్రి శంకర్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఉడుత జయంత్, నాయకులు బెజ్జంకి అనిల్, మోహన్, శానకొండ రాజు, తిరుపతి రెడ్డి, అనిల్,రాజు,నరేష్ తదితరులు పాల్గొన్నారు



## అక్రమాలపై ఆధారాలతోనే వార్తలు రాయాలి: ఎంపీ రఘునందన్ రావు

- **డిజిటల్ మీడియా ప్రజలకు చేరువైంది**
- **అక్రమ అరెస్టులు చేస్తే న్యాయపోరాటం చేస్తాం**




**సిద్దిపేట పవర్ జిల్లా ప్రతినిధి** తెలంగాణలో ఉన్నమీడియాలో డిజిటల్ మీడియా సమాజానికి మరింత దగ్గరగా ఉందని, జర్నలిజం నైతిక విలువలను కాపాడుకోవడంలో ప్రతి పాత్రికేయుడు కీలక పాత్ర పోషించాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన డిజిటల్ మీడియా రక్షణ చట్టాలపై అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు.అక్రమాలపై ఆధారాలు లేకుండా రాసే వార్తలు ప్రజల నమ్మకాన్ని దెబ్బ తీస్తాయి. జర్నలిస్టులు నిజానిజాలునిర్ధారించుకొని, ఆధారాలతోనే వార్తలు అందించాలి" అని ఆయన సూచించారు. ప్రజల సమస్యలను వెలుగులోకి తేవడమే కాకుండా, సమాజంలో పారదర్శకతను పెంచడం జర్నలిస్టుల ధర్మమని ఆయన గుర్తు చేశారు.రఘునందన్ రావు మాట్లాడుతూ, "అక్రమ అరెస్టులు చేస్తే మేము న్యాయపోరాటానికి దిగుతాం. పత్రికా స్వేచ్ఛను ఎవరూ అణగదొక్కలేరు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని అన్నారు. "జర్నలిస్టులు మంచి భాష వాడాలి. వ్యక్తిగత దూషణలు చేయకుండా వాస్తవాలను ప్రామాణికంగా రాయడం ద్వారా సమాజంలో విశ్వాసం పెంపొందుతుంది" అని ఆయన పేర్కొన్నారు. డిజిటల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందుతోందని, ప్రతి వార్తలో బాధ్యతాయుత ధోరణి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కప్పర ప్రసాదరావు మాట్లాడుతూ, "రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయిలో ఉండి జర్నలిస్టులను అవమానించేలా బట్టలూడదీస్తా అని మాట్లాడడం చాలా దారుణం. మరొకసారి ఇలాంటి మాటలు వస్తే న్యాయపోరాటానికి సిద్ధమవుతాం" అని తీవ్రంగా హెచ్చరించారు. ఆయన అన్నారు, "ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభమైన పాత్రికేయులను కించపరిచే వ్యాఖ్యలు చేయడం అనాగరికం. జర్నలిస్టుల హక్కుల కోసం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాం" అని చెప్పారు. డిజిటల్ మీడియా వర్కింగ్ జర్నలిస్ట్ కమిటీ ఆవిర్భావ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు అధ్యక్షులుగా నిర్మల హిట్ టీవీ ప్రధాన కార్యదర్శిగా మహేష్ తో పాటు పలువురిని ఎన్నుకున్నారు ఈ అవగాహన సదస్సులో పలువురు జర్నలిస్టులు పాల్గొని డిజిటల్ మీడియా చట్టపరమైన రక్షణ, భవిష్యత్ సవాళ్లపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ డబ్ల్యూజే జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ పెద్దపురం నరసింహ సెక్రెటరీ డాక్టర్ భరత్ కుమార్ శర్మ టీజేయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బింగి స్వామి వైస్ ప్రెసిడెంట్ దాసన్న రాష్ట్ర కార్యదర్శి బాపురావు, సిహెచ్ శ్రీనివాస్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రామకృష్ణ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఎల్లయ్య మేడ్చల్ మల్కాజిగిరి అధ్యక్షులు శ్రీనివాస్, సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అశోక్ సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ మరాటి కృష్ణమూర్తి మహేష్, సిద్దగౌడ్,రచన,వసంత్ ,అభినవ్ గంగాధర్ అజిత్వివిధ జిల్లా జర్నలిస్టులతో పాటు నూతన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి

జగదేవపూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నాయిని శ్రవణ్ కుమార్ ( 16 ) కొంతం మహేష్ ( 34) డెంగ్యూ జ్వరంతో మృతి చెందారు. సోమవారం జగదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రవీందర్ రెడ్డి గజ్వేల్ మార్కెట్ చైర్మన్ నరేందర్ రెడ్డి తో కలిసి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వారి వెంట గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు జగదేవపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు , మాజీ సర్పంచులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మట్టి గణపతినే పూజిద్దాం!! పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రకృతి ప్రేమికులు ప్రతి ఏటా చేసే నినాదం 'మట్టి గణపతిని పూజిద్దాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం' నిజానికి ప్రతి ఒక్కరూ ఇలా మట్టి గణపతిని పూజిస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేసినట్లే!

**భగవంతుని పూజలో భక్తి ప్రధానం**

భగవంతుని పూజకు భక్తి ప్రధానం. భక్తి లేకుండా బంగారు విగ్రహాన్ని పూజించినా ఫలితం ఉండదు. త్రికరణ శుద్ధితో, భక్తి శ్రద్ధలతో చిన్న వినాయకుని పూజించినా ఫలితం ఉంటుంది. అంతేకాని ఆర్భాటాలకు, గొప్పలకు పోయి పెద్ద పెద్ద విగ్రహాలను పెట్టి తరువాత వాటిని నిమజ్జనం చేసేటప్పుడు ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పెద్ద విగ్రహాల తయారీలో వాడే వస్తువులు నీటిలో కరిగిపోవు. నీటి కాలుష్యానికి కారణమయ్యే అనేక రకాల కృతిమ రంగులు, కెమికల్స్ వీటిలో ఉంటాయి. వినాయక చవితిని సింపుల్ గా చేసుకోవడం వల్ల నష్టమేమీ లేదు. ఎంత భక్తిగా దేవుని పూజిస్తున్నామో ముఖ్యం గానీ, ఎంత ఆడంబరంగా చేస్తున్నామన్నది ముఖ్యం కాదు. పురాతన దేవాలయాల్లో రాతి విగ్రహాలను చూస్తాం కానీ, కృత్రిమ పదార్థాలతో తయారు చేసిన విగ్రహాలను పూజించమని ఎక్కడా చెప్పలేదు.

**టి గణేష్ బాబు**
**సీనియర్ జర్నలిస్టు**






## కొండపోచమ్మ ఆలయ అభివృద్ధి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- **తెలంగాణ ప్రభుత్వం నుండి మరిన్ని నిధులు తీసుకవస్తా**
- **తెలంగాణ ప్రభుత్వ విప్ప బిర్ల ఐలయ్య**

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం :**జగదేవపూర్ మండలం తీగుల్ నర్సాపూర్ గ్రామంలోవెలసిన ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీ కొండపోచమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణం లో బిర్ల ఐలయ్య పౌండేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యతిధిగా ఆలేరు ఎమ్మెల్యే తెలంగాణ ప్రభుత్వ విప్పు బిర్ల ఐలయ్య సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షుడు తుంకుంటా నర్సారెడ్డి హజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ కొండపోచమ్మ ఆలయం అభివృద్ధి దిన దిన సాగుతున్న ప్రజలందరికీ అందుబాటులో ఉండే విధంగా ప్రజా ప్రభుత్వం సాగుతుందని అన్నారు. ఆలయానికి ఎక్కువ భక్తులు వస్తున్నారని వచ్చే భక్తులకు మంచినీళ్లు తాగించాలని సహోద్దేశంతో అమ్మవారి ఆశీస్సులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం విప్పుగా తప్పకుండా నిధులు ఇచ్చి ఆలయ అభివృద్ధికి సహకారం చేస్తానని అన్నారు. అదేవిధంగా లైట్లు కూడా డీజే విధంగా చేస్తామని అన్నారు. బీర్ల ఫౌండేషన్ ద్వారా వాటర్ ప్లాంట్ నిర్మించామని బీర్ల ఫౌండేషన్ ద్వారా ఆలయ అభివృద్ధికి నిధులు ఇస్తామని అన్నారు. మా ఇంటి ఇలవేల్పు కొండపోచమ్మ దర్శించుకోవడం దర్శనం చేసుకోవడం జరిగిందని అన్నారు. అదేవిధంగా కొండ పోచమ్మ ఆలయ అభివృద్ధికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి ఏం సి వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ముడుపు భూమి రెడ్డి కొండపోచమ్మ ఆలయ చైర్మన్ అను గీత నాచారం దేవస్థానం చైర్మన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేసిరెడ్డి రవీందర్ కుకునూరుపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆలయ ఈవో రవికుమార్ ఏఎంసీ డైరెక్టర్లు యాదయ్య గజ్వేల్ పట్టణ కార్యదర్శి నక్క రాములు కొండపోచమ్మ డైరెక్టర్లు రామ్ రెడ్డి తాజా మాజీ సర్పంచులు గర్నెపల్లి రజిత రమేష్ కొంపల్లి కరుణాకర్ రాజేందర్ రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాజీ ఎంపిటిసిలు మహేందర్ యాదవ్ మహేందర్ రెడ్డి రవి కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్ రెడ్డి అజీజ్ ఆంజనేయులు బాబీ కిష్టయ్య దండే వెంకటేష్ శేఖర్ చిరంజీవి ఆలయ సిబ్బంది రికార్డ్ అసిస్టెంట్ కనకయ్య అర్చకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## కత్తి కార్తీక గౌడ్ ఆఫీస్ ఆవరణలో శ్రీ సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్ ఆగస్టు 26 ప్రతినిధి**

దుబ్బాక నియోజకవర్గంలో జరగబోయే శ్రీ వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా బుధవారం కత్తి కార్తీక గౌడ్ బిఆర్ఎస్ పార్టీ ఆఫీస్ వద్ద,రామ సముద్రం , దుబ్బాకలో ఆగస్టు 27, 2025 నుండి 15 రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పూజా కార్యక్రమం ప్రారంభం: ఆగస్టు 27, 2025, సాయంత్రం 6:00 గంటలకు ప్రతిరోజు నిత్య అన్నదానం: మధ్యాహ్నం 1:00 గంటలకు చేపడుతున్నారు.ఈ ఉత్సవాలలో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించబడతాయి. ఈ ఉత్సవాలకు మీరు, మీ కుటుంబ సభ్యులు అందరూ హాజరై శ్రీ గణనాథుని దర్శించుకోవాలని



బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ ఆహ్వానిస్తున్నారు.

## రాష్ట్రంలో... దమ్మున్న మొగాడు రేవంత్ రెడ్డి

- **కేంద్ర నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా సమస్య**
- **మోదీని విమర్శించేందుకు భయపడుతున్న కేటీఆర్**
- **ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్**



**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం :** రాష్ట్రంలో దమ్మున్న మగాడు రేవంత్ రెడ్డి కాగా, ఓయూలో అడుగుపెట్టి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్ స్పష్టం చేశారు. మంగళవారం రిమ్మనగూడ శివారులో డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో ఉస్మానియా యూనివర్సిటీని భ్రష్టు పట్టించగా, చెక్కదిద్దే క్రమంలో అడుగుపెట్టి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన రేవంత్ రెడ్డి సాహసోపేత, చారిత్రాత్మక నిర్ణయాలతో ముందుకెళ్తున్నట్టు స్పష్టం చేశారు. ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధిని జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నేతలు తమ పార్టీలో కొనసాగుతున్న మూడుముక్కలాటను మర్చిపోతున్నట్లు విమర్శించారు. అయితే వారి హయాంలో జరిగిన ఘనకార్యాలు, అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతుండడంతో ప్రజలు ఛీ కొడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రాష్ట్రంలో యూరియా సమస్య తలెత్తగా, ఆ నెపాన్ని కాంగ్రెస్ ప్రభుత్వంపై నెట్టుతుండడం సిగ్గుచేటని నిలదీశారు. అయితే బిజెపి రైతులను తప్పుదారి పట్టిస్తుండగా, మోడీ భయంతో బిఆర్ఎస్ నేతలు వారికి వంత పాడుతున్నట్లు ఎద్దేవా చేశారు. ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియతో బిఆర్ఎస్, బిజెపి పార్టీల పునాదులు కదిలిపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ విజయపరంపర కొనసాగించడం ఖాయమని అన్నారు. ముఖ్యంగా పార్టీ శ్రేణులు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాల్సిన బాధ్యతను గుర్తెరగాలనీ వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి విజయమోహన్ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ ప్రభాకర్ గుప్తా సీనియర్ నాయకులు రంగారెడ్డి నాచారం టెంపుల్ చైర్మన్ రవీందర్ గుప్తా వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు మాజీ ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల పాల్గొన్నారు.

## తిమ్మాపూర్ గ్రామాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ గరిమి అగ్వాల్

**సిద్దిపేట పవర్ గజ్వెల్:** జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామాన్ని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) సందర్శించారు. గ్రామంలో ఇటీవల నమోదైన డెంగ్యూ కేసులు సంబంధించి బాధితులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అదనపు కలెక్టర్ గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందికి పరిశుభ్రత, డ్రైనేజీ శుభ్రపరిచే పనులు, యాంటీ లార్వా చర్యలు తీసుకోవడం మరియు ప్రజల్లో అవగాహన కల్పించడం పై కఠినమైన సూచనలు ఇచ్చారు.అలాగే ప్రతి శుక్రవారం ఇంటింటా డ్రై డే పాటించాలనీ ఆదేశించారు.తిమ్మాపూర్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన మీ డే మెల్స్ మెనూ ప్రజారంగంలో ఉంచుతున్నారా లేదా అని పరిశీలించారు.తరువాత జగదేవపూర్ గ్రామ పంచాయతీలోని కస్తూర్బా పాఠశాలను సందర్శించి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులతో మమేకమై మాట్లాడి, వారికి అందుతున్న భోజనంపై మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా అని తెలుసుకున్నారు.అదనపు కలెక్టర్ ఆరోగ్య, పంచాయతీ రాజ్ మరియు విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని, గ్రామాల్లో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని వివరించారు.



# ఊదలతో ఉబకాయం దూరం..!

భారతదేశంలో చిరు ధాన్యాలను తరచుగా ఉపయోగిస్తారు. చిరుధాన్యాలలో అనేక పోషకాలు నిండి ఉంటాయి. అవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందులో ఊదలు కూడా ఒకటి. పురాతన కాలం నుండి ఊదలు ఆహారంగా, ఔషధంగా ఉపయోగించబడుతున్నాయి. వీటిలో ఫైబర్, ప్రొటీన్లు, కాల్షియం, ఐరన్, ఫాస్పరస్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. అన్నం, కిచిడీ, దోసె, ఇడ్లీ ఇలా రకరకాలుగా ఊదలతో చేసుకుని తినవచ్చు.. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పౌష్టికాహారం. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ఊదలు తినడం చాలా మంచిది. వాటిని నేరుగా తినకుండా పాలు, స్మూతీస్ లేదా స్వీట్లతో కలుపుకోవచ్చు. గుండె జబ్బులు ఉన్నవారు వీటిని పరిమిత పరిమాణంలో తినాలి. ఊదలలో క్యాలరీలు తక్కువగానూ, పీచుపదార్థాలు ఎక్కువగానూ ఉండటం వల్ల కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఇది ఆకలిని తగ్గిస్తుంది మరియు బరువు నియంత్రణలో సహాయపడుతుంది. ఊదలులో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా ఉండాలంటే రోజూ ఊదలు తినడం మంచిది. ఊదలు గ్లూటెన్ రహిత ఆహారం. అందువల్ల, గ్లూటెన్ అలెర్జీ ఉన్నవారు కూడా వాటిని తినవచ్చు. ఊదలలోని విటమిన్ సి, విటమిన్ డి చర్మాన్ని ఆరోగ్యంగా, పోషణతో ఉంచడంలో సహాయపడతాయి. ఇది చర్మాన్ని ముడతలు పడకుండా చేసి చర్మం యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. ఊదలు తినడం వల్ల మూత్రాశయ నియంత్రణకు, పిత్తాశయ రాళ్లను తొలగించడానికే కాకుండా.. కొన్ని రకాల జ్వరాలకు చికిత్స చేయడానికి కూడా సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఊదలు తక్కువ గ్లైసెమిక్ సూచికను కలిగి ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నెమ్మదిగా పెంచుతుంది. మధుమేహం ఉన్నవారికి లేదా మధుమేహం వచ్చే ప్రమాదం ఉన్నవారికి ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. గర్భిణీ స్త్రీలు పాలకూర తింటే చాలా మేలు జరుగుతుంది. అవి పుట్టబోయే బిడ్డ అభివృద్ధికి అవసరమైన ఇనుమును అందిస్తాయి. ప్రసవ సమయంలో ఉపశమనాన్ని అందించడానికి ఊదలు సహాయపడుతుందని పరిశోధనలు కూడా చెబుతున్నాయి. ఊదలు గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి మరియు గుండె సంబంధిత రుగ్మతల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఊదలలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని హానికరమైన ఫ్రీ రాడికల్స్‌ని తొలగించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. అందువలన, అవి శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షిస్తాయి.




# ఈ లడ్డూ రోజుకు ఒకటి తింటే చాలు

ప్రస్తుత పరుగుల ప్రపంచంలో పోషకాహార లోపం అతి పెద్ద సమస్యగా మారుతుంది. పని ఒత్తిడి వల్లో, సమయం లేకనో చాలా మంది రెడి టు ఈట్ ఆహారం వైపు, ఫాస్ట్ ఫుడ్ వైపు అడుగులు వేస్తున్నారు. అవి తినడం వల్ల ఆ కాసేపు నోటికి రుచికరంగా, ఆ క్షణానికి తినాలి అన్న పని ముగుస్తుంది. కానీ మనకు ఆరోగ్య పరంగా ఎటువంటి మేలు ఉండదు. పైగా అనారోగ్య కారకాలు అధికమైపోతాయి. ఈ విషయం అందరికీ తెలుసుకు. కానీ పని ఒత్తిడి బాస్.. ఫుడ్ ప్రిపేర్ చేసుకునే సమయం లేకనే ఇలా చేస్తున్నాం. లేకపోతే ఈ ఫుడ్ తినడం మాకు మాత్రం ఇష్టమా ఏంటి అని సమాధానం చెప్తారు. అయితే ఇకపై హెల్తీ ఫుడ్ కోసం వంటగదుల్లో ప్రతి రోజూ యుద్ధాలు చేయాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. పిజ్జాలు, బర్గర్, ఫ్రైడ్ రైస్‌లు వంటి జంక్ తినడం వల్ల ఏర్పడిన పోషకాల లోపాలను రోజుకు ఒక్క లడ్డూ తినడం ద్వారా తగ్గించుకుకోవచ్చంటున్నారు. ఈ లడ్డూ ప్రతి రోజూ ఒకటి తింటే ఎటువంటి పోషకాహార లోపాలు ఉన్నా తగ్గుతాయని, వాటి వల్లు వచ్చేర సమస్యలు కూడా దూరమవుతాయని నిపునులు అంటున్నారు. అవే మల్టీసీడ్స్ లడ్డూలు. మరి వీటి రెసిపీ ఏంటో తెలుసా.. రండి చూసేద్దాం.

## కావలసిన పదార్థాలు

అవిసె గింజలు రెండు స్పూన్లు
గుమ్మడి గింజలు రెండు స్పూన్లు
సన్ ఫ్లవర్ సీడ్స్ రెండు స్పూన్లు
నువ్వులు రెండు స్పూన్లు
ఓట్స్ పావు కప్పు
ఖర్జూరాలు పది
యాలకుల పొడి చిటికెడు
నెయ్యి ఒక స్పూను

## మల్టీ సీడ్స్ లడ్డూ రెసిపీ

1. స్టవ్ మీద కళాయి పెట్టి అవిసె గింజలు, గుమ్మడి గింజలు, పొద్దు తిరుగుడు గింజలు, నువ్వులు, ఓట్స్ వంటివన్నీ కూడా వేయించుకొని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి.
2. స్టవ్ మీద కళాయి పెట్టి ఒక స్పూన్ నెయ్యిని వేయాలి.
3. ఆ నెయ్యిలో ఖర్జూరాలను సన్నగా తరిగి వేయించుకోవాలి.
4. ఆ ఖర్జూరం మిశ్రమంలోనే ముందుగా రుబ్బి పెట్టుకున్న పొడిని కూడా వేసి బాగా కలపాలి.
5. అలాగే యాలకుల పొడిని కూడా వేయాలి.
6. ఈ మొత్తం మిశ్రమాన్ని స్టవ్ ఆఫ్ చేసి మొత్తం మిశ్రమాన్ని చల్లార్చాలి.
7. ఇప్పుడు ఈ మిశ్రమంలో అవసరమైతే కొంచెం నెయ్యిని వేసుకొని లడ్డూల్లా చుట్టుకోవాలి.
8. అంతే టేస్టీ మల్టీ సీడ్స్ లడ్డు రెడీ అయినట్టే.
9. వీటిని సీసాలో ఉంచి మూత పెట్టాలి. ప్రతిరోజూ ఒకటి తింటే చాలు, మీ శరీరానికి కావలసిన పోషకాలు అందుతాయి.





## వీటి వల్ల కలిగే ప్రయోజనాలు

మల్టీ సీడ్స్ లడ్డు రెసిపీలో మనం అవిస గింజలను వాడాము. ఇందులో చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచే గుణాలు ఉన్నాయి. అవిసె గింజలను ప్రతిరోజూ ఆహారంలో భాగం చేసుకోమని కూడా చెబుతారు. ఇవి జీర్ణ క్రియను మెరుగుపరుస్తాయి. క్యాన్సర్ తో పోరాడుతాయి. మధుమేహాన్ని నియంత్రిస్తాయి. రక్తపోటును కూడా అదుపులో ఉంచుతాయి. చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. అలాగే ఖర్జూరాన్ని కూడా ఎక్కువగానే వినియోగించాము. ఈ ఖర్జూరంలో కాల్షియం, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, ప్రొటీన్, ఫైబర్, విటమిన్స్ వంటివి పుష్కలంగా ఉంటాయి.

ఖర్జూరంలో ఇనుము కంటెంట్ అధికంగా ఉంటుంది. కాబట్టి రక్తహీనత సమస్యతో బాధపడుతున్న వారు ఖర్జురాన్ని ఆహారంలో భాగం చేసుకుంటే ఉత్తమం. ప్రతిరోజూ రెండు ఖర్జూరాలు తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు కూడా చెబుతున్నారు. అలాగే గుమ్మడి గింజలు, సన్ ఫ్లవర్ సీడ్స్, నువ్వుల్లో కూడా ఆరోగ్యానికి కావాల్సిన ఎన్నో విటమిన్లు, ఖనిజాలు ఉంటాయి. ఇవన్నీ కూడా మనకు పోషకాహార లోపం లేకుండా చేస్తాయి. కాబట్టి మల్టీ సీడ్స్ లడ్డును కచ్చితంగా మహిళలు పిల్లలు తినేందుకు ప్రయత్నించాలి.

